క్లుప్తంగా

సత్యదేవుని ఆలయంలో ఉగాది పూజలు

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 22న ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్, ధర్మకర్త వంకదారి రామరత్నమ్మ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు నవకలశ స్నపన తిరుమంజనం, విశేష అలంకారం ఉంటాయని వివరించారు. సాయంత్రం 5 గంటలకు టీటీడీ దేవస్థాన ఆగమ సలహాదారు, వేదిక్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేహెచ్ వరదరాజన్ పంచాంగ పఠనం చేయనున్నారని తెలిపారు.

నేడు చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు

వైవీయూ: కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 'గోల్స్ ఆఫ్ ఇండియా 2047' అన్న అంశంపై చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా నెహ్రూ యువకేంద్రం సమన్వయకర్త మణికంఠ తెలిపారు. జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9177616677 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

18న జాబ్ మేళా

ప్రొద్దుటూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.శశికాంత్‌రెడ్డి తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్, ట్రైనీ ఉద్యోగాలకు కెమిస్ట్రీ బీఎస్సీ, డిప్లమో, ఇంటర్ (ఎంపీసీ, బైపీసీ), ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రికల్) ఉత్తీర్ణులై 19 నుంచి 27 ఏళ్లు ఉన్న పురుష అభ్యర్థులు అర్హులని వారు వివరించారు. 18న శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంక్ బుక్ ఒరిజనల్, జిరాక్స్ కాపీలతోపాటు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్‌నంబర్ 9573321678కు సంప్రదించాలని తెలిపారు.

ఆలయాల హుండీ సొమ్ము లెక్కింపు



హుండీ సొమ్మును లెక్కిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరంలోని దేవదాయశాఖ ఆధ్వర్యంలోని రెండు శివాలయాల్లోని హుండీలలోని సొమ్మును గురువారం ఆ శాఖ అధికారులు లెక్కించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్దన్ తనిఖీ అధికారిగా హాజరయ్యారు. నగరంలోని మోచంపేటలోగల శ్రీ ప్రసన్న విశ్వేశ్వర స్వామి ఆలయంలో డిసెంబరు 19 నుంచి ఇప్పటివరకు హుండీల ద్వారా మొత్తం రూ.38,077 లభించిందని అధికారులు తెలిపారు. దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ మూడు నెలలకుగాను మొత్తం రూ.75,758 లభించాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఎ.రవిశంకర్, శివసాయిప్రసాద్, కేవీఎన్ ప్రసాద్, ఎస్‌ఏ పిచ్చయ్యమూర్తి, శివసత్యకుమార్, సుబ్రమణ్యం, మాజీ చైర్మన్ పద్మాకర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

కడప కార్పొరేషన్ : గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అనతి కాలంలోనే యూనియన్‌గా ఏర్పడి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు హిరామియా, నగర ప్రధాన కార్యదర్శి హేమసుందర్‌రాజు, సంయుక్త కార్యదర్శి సురేష్, సభ్యులు నజీర్, శ్రీను, తరుణ్, వసంతకుమారి, శ్రీవాణి పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

వీరపునాయునిపల్లె : రైతు వ్యతిరేఖ విధానాలపై ఈనెల 20వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టబోవు ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన వీరపునాయునిపల్లెలో విలేకరులతో మాట్లాడారు. రైతుల మోటార్లకు విద్యుత్ మీటర్ల రద్దు, సమగ్ర పంటల బీమా పథకం అమలు, రైతులకు సంబంధించిన అన్ని రకాల రుణాలు మాఫీ, స్వామినాథన్ కమిటీ సిఫారసు అమలు, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించి ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, ఉద్యమం సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన రైతులకు ఎక్స్‌గ్రేషియా, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటరుణాలు ఇవ్వాలనే డిమాండ్లపై ఆందోళన చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య బానోతు అంజనేయ ప్రసాద్



అమరజీవికి నివాళులర్పిస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : తెలుగు మాట్లాడే వారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌బాబు తెలిపారు. గురువారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా గోకుల్ సర్కిల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఆయన త్యాగం చిరకాలం గుర్తిండిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్ సూర్యనారాయణరావు, బంగారు నాగయ్య యాదవ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో..

కడప అగ్రికల్చర్ : తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి, అమరజీవి పొట్టి శ్రీరాములు అని కృషి విజ్ఞానకేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. గురువారం కేవీకేలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ మురళీకృష్ణ, కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, లావణ్య, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు రామలక్ష్మిదేవి, ప్రత్యూష, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

ఏఎఫ్‌యూ : అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిదని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ పేర్కొన్నారు. గురువారం నగర పరిధిలోని విశ్వవిద్యాలయంలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణదీక్ష చేపట్టి ప్రాణ త్యాగం చేసిన గొప్ప నాయకుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'అమరజీవి'కి ఘన నివాళి

కడప కల్చరల్ : తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు పలువురు నివాళులర్పించారు. కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ ఇతర సిబ్బందితోకలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల అలంకరించారు. ఉపగ్రంథ పాలకులు యలిశెట్టి పవన్‌కుమార్, లైబ్రేరియన్ బాబ్జి, సుబ్రమణ్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో అమరజీవికి నివాళి



కేవీకేలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉద్యోగులు

'స్కౌట్ అండ్ గైడ్స్' అభివృద్ధికి సహకరించండి



కమిషనర్‌ను కలిసిన స్కౌట్ అండ్ గైడ్స్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణతో విద్యార్థులలో క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశభక్తి పెంపొందుతుందని కడప నగరపాలక కమీషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. గురువారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ను జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి కలిశారు. స్కౌట్ అండ్ గైడ్స్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కడప శంకరాపురంలోని స్కౌట్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలతో పాలు పలు సమస్యల గురించి జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకర్‌లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, ఎంఈఓ పాలెం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలను అందించండి



వల్లూరులో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు : గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. వల్లూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి కేంద్ర నిర్వహణ గురించి ఆరా తీశారు. సేకరించిన వ్యర్థాల నుంచి ప్లాస్టిక్, ఇతర మెటీరియల్‌ను వేరు చేసిన తరువాత వాటిని వీలైనంత త్వరగా అమ్మకం చేయడం ద్వారా గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చడానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది తప్పని సరిగా సమయ పాలన పాటించి అంకిత భావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఆదేశించారు. తప్పనిసరిగా డ్రస్ కోడ్‌ను పాటించాలని ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని జంగంపల్లె గ్రామాన్ని సందర్శించి జగనన్న భూ రక్ష కార్యక్రమ రికార్డులను, మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో వర్షం

- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు
- కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత



కడప ఆర్టీసీ బస్టాండు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం దాకా తీవ్రమైన ఎండ ఉన్నప్పటికీ సాయంత్రం వాతావరణ మారిపోయింది. రాత్రి 7.30 గంటల నుంచి సుమారు అరగంటకు పైగా వర్షం కురిసింది. వివిధపనుల నిమిత్తం బయటికి వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రధాన రహదారికి ఇరువైపుల వర్షపు నీరు నిలువడంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే నగరంలోని మృత్యుంజయ కుంట, గౌస్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాలలో రోడ్లపై వర్షపు నీరు నిలిచాయి.

కడప కార్పొరేషన్: కడప నగరంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వాన కురిసింది. కడప చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో కూడా వాన ఎక్కువగా కురిసింది. గాలుల ధాటికి రింగ్‌రోడ్‌లో ఎండిపోయిన కంపంతా రోడ్డుపైకి రావడంతో వాహనాలకు ఇబ్బంది కలిగింది. చాలా చోట్ల గాలులకు విద్యుత్ స్తంబాలు దెబ్బతిని, తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నగర శివార్లలోని రామాంజనేయపురం, సెంట్రల్ జైలు ప్రాంతాల్లో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొత్తం మీద మండు వేసవిలో కురిసిన ఈ వర్షం కొంత మేర ఇబ్బందులను కలిగించినప్పటికీ వాతావరణం చల్లబడడం ఊరటే.

తొలిరోజు పరీక్షలకు 143 మంది గైర్హాజరు

22 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు
6017 మంది హాజరు



పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం కడప మండలంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జనరల్ విభాగంలో 5570 మంది విద్యార్థులకుగాను 5458 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషన్‌కు సంబంధించి 590 మందికిగాను 559 మంది హాజరయ్యారు. మొత్తం 6160 మందిలో 143 మంది గైర్హాజరయ్యారు. కడపలోని పలు పరీక్షా కేంద్రాలను ఆర్‌ఐవో రమణరాజుతోపాటు స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేశారు. అలాగే ఆర్‌జేడీ రవి ఆర్‌ఐఓ కార్యాలయంలోని ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లో పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించి పరీక్షా కేంద్రాల సిబ్బందికి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు.

ఆధ్యాత్మికతతో ఉన్నత విలువలు



విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : విద్యార్థులు బాల్యం నుంచే ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే జీవితంలో వారికి ఉన్నత విలువలు అలవడతాయని మదరసా సిరాజుల్ ఉలూమ్ కరస్పాండెంట్ మౌలాన మౌఫ్తీ సయ్యద్‌షా భక్తియారుద్దీన్ ఖాద్రి సాహెబ్ అన్నారు. గురువారం అల్మాస్‌పేటలోని మదరసా సిరాజుల్ ఉలూమ్‌లో విద్యార్థులకు నాతియా కలాం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో తాము నేర్చుకున్న భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఏ పోటీలలోనైనా ఉత్సాహంగా పాల్గొని బహుమతి కోసం పోటీ పడాలని, అప్పుడే ప్రతిభ వెలుగులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు షేక్ అమీన్, సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధికి కృషి


ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సొసైటీల(పీఏసీఎస్) అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. గురువారం కడపలోని డీసీసీ బ్యాంకు కాన్ఫరెన్స్‌హాల్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు సహకారంతో జిల్లాలోని సొసైటీల ద్వారా బంగారు ఆభరణాలపై రుణాలను ఇవ్వడంతోపాటు చిరు వ్యాపారులకు రుణాలు ఇస్తున్నామన్నారు. పలు సొసైటీలకు పెట్రోల్ బంకుల కోసం, ఫంక్షన్ హాల్ కోసం 4 శాతం వడ్డీతో నాబార్డు ద్వారా రుణాలు ఇప్పించి సొసైటీలను బలోపేతానికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే డీసీసీ బ్యాంకు ద్వారా పంట రుణాలే కాకుండా సిహెచ్‌సి ద్వారా వ్యవసాయ పనిముట్లు, జగనన్న తోడు ద్వారా చిరు వ్యాపారులకు, పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు, విద్యార్థులకు విద్యారుణాలు అందిస్తున్నామన్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ విషయంలో సొసైటీ ప్రెసిడెంట్స్ ప్రజలలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ కడప బ్యాంకు అభివృద్ధికి, సొసైటీల అభివృద్ధికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సర్వసభ్య సమావేశంలో వివరించారు. అలాగే బ్యాంకు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని 44 మంది సిబ్బందిని కొత్తగా నియమించామని తెలిపారు. అలాగే 2023–24 సంవత్సరానికి కావాల్సిన బడ్జెట్‌ను కూడా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ సుబ్బారెడ్డి, నాబార్డు డీడీఎం, ఆప్కాబ్ జీఎం శ్యామ్‌సుందర్, షిఫరీస్ డీడీ నాగలింగాచారి పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



హాస్టల్ విద్యార్థులతో పుల్లగూర విష్ణువర్దన్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు

విద్యాశాఖ రాష్ట్ర రీసోర్సు పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడే వనరులుగా మారాలని విద్యాశాఖ రాష్ట్ర రీసోర్సు పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు సూచించారు. కడప ప్రకాష్‌నగర్‌లోని జేఎస్‌ఓఎస్ అర్బన్ హాస్టల్‌కు ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్ కువైట్ వారి సహకారంతో మీ కోసం సేవాసంస్థ ఆధ్వర్యంలో రూ. 20 వేలు విలువచేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీ కోసం సేవాసంస్థ అధ్యక్షులు పుల్లగూర విష్ణువర్దన్, ఈశ్వర చారిట్రబుల్ ట్రస్టు రాజశేఖర్‌రెడ్డి, హాస్టల్ సిబ్బంది సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలి

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికులకు వ్యక్తిగత, హౌసింగ్ లోన్లు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం ఈ మేరకు వారు మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌కు వినతిపత్రమిచ్చారు. ఆయన వెంటనే బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడగా.. బ్యాంకు అధికారులు అంగీకరించారు. రుణాలకు సంబంధించి ఏయే పత్రాలు కావాలో కమిషనర్ ద్వారా తెలియజేస్తామని బ్యాంకు అధికారులు తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్యాంకు రుణాల సమస్య పరిష్కారం కావడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు సుంకర రవి, తిరుపాల్, శ్రీధర్‌బాబు, ప్రకాశ్, నరసిహులు, వెంకటేశ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మబంధువుకు అంతిమ సంస్కారం



యువకుడి మృతదేహం

కడప అర్బన్ : గుర్తు తెలియని ఓ యువకుడి మృతదేహానికి మేము సైతం సేవా సంస్థ వారు అంత్యక్రియలు నిర్వహించారు. నగరంలోని గోకుల్ సర్కిల్ సమీపంలో ఈనెల 8వ తేదిన రాత్రి 9 గంటల సమయంలో యువకుడు అనారోగ్య కారణంగా కిందపడిపోయాడు. స్థానికులు గమనించి 108 ద్వారా రిమ్స్‌కు పంపించారు. ఆస్పత్రిలో వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచారు. ఎవరూ రాకపోవడంతో మేము సైతం సేవా సంస్థ వారికి అంత్యక్రియల కోసం సిఫార్సు చేశారు. హిందూ సంప్రదాయం మేరకు మృతుడికి అంత్యక్రియలు నిర్వహించారు. మేముసైతం సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి రవి, హెడ్ కానిస్టేబుల్ అయ్యవారయ్య పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని అనిమెల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధులకు హాజరుకాని వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చురుగ్గా ఉండాలని సిబ్బందికి తెలిపారు. సచివాలయంలో సంక్షేమ పథకాలవారిగా, లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి మంజూరుకాలేదన్న సమస్య రాకూడదన్నారు. గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు నరేష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది.

రోడ్డుపైకి మురికి నీరు



రోడ్డుపై నిలిచిన మురికి నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం ఆర్టీసీ బస్టాండు అవుట్ గేట్ వద్ద డ్రైనేజీ నుంచి మురికి నీరు రోడ్డుపై రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై మురికి నీరు నిలబడి దుర్వాసన వెదజల్లుతుండడంతో పాదాచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. బస్సులు బస్టాండు నుంచి బయటికి వచ్చే మార్గం కావడంతో ఆ దారిన వెళుతున్న ప్రజలపై మురికి నీరు పడి పలుమార్లు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ విషయంగా మున్సిపల్ అధికారులు సత్వరమే స్పందించి మురికి నీటి నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయఢంకా

- పార్టీ ఉపాధ్యాయ అభ్యర్థి రామచంద్రారెడ్డి ఘన విజయం
- లెక్కింపు ప్రారంభం నుంచే దూసుకెళ్లిన వైనం
- రాత్రి 2 గంటలకు వీడిన ఉత్కంఠ
- కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్
- అధికార పార్టీ అభ్యర్థి 'వెన్నపూస' వైపే ఓటరు మొగ్గు!
- ఫలితం నేడు తేలే అవకాశం

అనంతపురం సప్తగిరి సర్కిల్/అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించింది. పార్టీ అభ్యర్థి రామచంద్రారెడ్డి ఘన విజయం సాధించారు. గురువారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా, ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యత కనబరుస్తూ వచ్చారు. అర్ధ రాత్రి 2 గంటలకు ప్రక్రియ ముగియగా, రామచంద్రా రెడ్డి విజయం సొంతం చేసుకున్నారు.

ఆది నుంచే ఆధిక్యత

కౌంటింగ్ ప్రారంభం నుంచే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి పూర్తి ఆధిక్యత కనబరిచారు. తొలి రౌండ్‌లో 4,756 ఓట్లతో తొలి స్థానం సాధించిన ఆయన రెండో స్థానంలో నిలిచిన ఒంటేరు శ్రీనివాసరెడ్డిపై 1,213 ఓట్ల ఆధిక్యంలో నిలిచారు. ఇక.. రెండో రౌండ్‌లోను ఆధిక్యతను నిలబెట్టుకున్న రామచంద్రారెడ్డి 4,090 ఓట్లను సాధించారు. 780 ఓట్లతో ముందంజలో నిలిచారు. మొత్తం రెండు రౌండ్లలో 8,846 ఓట్లను సాధించి మొత్తం 1,993 ఓట్ల ఆధిక్యత సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలకపోవడంతో అధికారులు రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. ఈ క్రమంలో ఒక్కొక్కరినీ ఎలిమినేట్ చేయగా, చివరికి ఒంటేరు శ్రీనివాస రెడ్డి, రామచంద్రారెడ్డి మిగిలారు. చివరికి రామచంద్రారెడ్డి జయకేతనం ఎగురవేశారు.

ఆధిక్యంలో 'వెన్నపూస'

పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన వెన్నపూస రవీంద్రారెడ్డి కూడా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయానికి రెండు రౌండ్ల ఫలితాలు పూర్తికాగా వెన్నపూస రవీంద్రారెడ్డి 19,519 ఓట్లతో కొనసాగుతున్నారు. టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి 17652 ఓట్లతో రెండో స్థానంలో ఉన్నారు. పూర్తి ఫలితం శుక్రవారం సాయంత్రం వచ్చే అవకాశం ఉంది.

కలెక్టర్ ఆధ్వర్యంలో కౌంటింగ్

స్థానిక జేఎన్‌టీయూ అనంతపురంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 388 బ్యాలెట్ పెట్టెలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సబంధించి 175 బ్యాలెట్ పెట్టెల్లోని ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. బ్యాలెట్ పెట్టెలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ సమక్షంలో అధికారులు తెరిచారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల పెట్టెలను కేంద్రానికి తరలించారు. వాటిని సిబ్బంది కట్టలుగా కట్టి ప్రాథమిక లెక్కింపు చేపట్టారు. బ్యాలెట్ పెట్టెలను కౌంటింగ్ కేంద్రంలోకి టేబుల్ వారీగా తరలించారు. పెట్టెలను ఎన్నికల పరిశీలకులు హరిజవహర్ లాల్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ ఫకీరప్ప కాగినెల్లి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఆర్‌ఓ గాయత్రిదేవి పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరగడంతోనే..

యాభై శాతం ఓట్లకు పైగా ఒక్క అభ్యర్థికీ రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. అందువల్లే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితం అర్ధరాత్రి తర్వాత వెలువడింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా భారీగా పోలింగ్ శాతం నమోదు కావడంతో కౌంటింగ్ ఆలస్యమైంది.

పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్ రెండు రౌండ్ల ఫలితాలిలా..

వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్ సీపీ)	19,519
భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి (టీడీపీ)	17,652
పోతుల నాగరాజు (పీడీఎఫ్)	3,552
నగరూరు రాఘవేంద్ర (బీజేపీ)	1,459